క్లుప్తంగా

అనంతపల్లిలో బస్టాండ్ ప్రారంభం



బస్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: ప్రయాణికుల సౌకర్యార్థం అనంతపల్లి గ్రామంలో నిర్మించిన బస్టాండ్‌ను శనివారం ఉదయం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధులు రూ.22 లక్షల వ్యయంతో ఈ బస్టాండ్‌ను నిర్మించారు. అనంతపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రయాణికులు ఈ బస్టాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంగల కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త, వైఎస్సార్ సీపీ నాయకుడు బంక అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, మద్దిపాటి ప్రసాద్, గన్నమని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ



విశేష అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి వారు

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారిని శనివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను పురోహితులు వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. వేకువజామునే స్వామి వారికి అభిషేకం నిర్వహించాక, భక్తుల దర్శనానికి అనుమతించారు. ఏడ గంటలకు మొదలైన భక్తుల రద్దీ మధ్యాహ్నం వరకూ కొనసాగింది. స్వామివారి దర్శనానికి భక్తులకు సుమారు గంట సమయం పట్టింది. భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి అన్న సమారాధన మొదలైంది. నిడదవోలుకు చెందిన దాత సంకు జానికిరామయ్య, ఆదిలక్ష్మి దంపతుల చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

150 మంది కార్మికులకు వస్త్రాల పంపిణీ



కార్మికులకు నూతన వస్త్రాలు, స్వీట్లు అందజేస్తున్న కాశీవిశ్వనాథం

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా యర్నగూడెం గ్రామంలోని పరిశ్రమలో పనిచేస్తున్న 150 మంది కార్మికులకు పరిశ్రమ యజమాని శ్రీకాకొళపు కాశీవిశ్వనాథం నూతన వస్త్రాలు, స్వీట్లు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథం మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా సంక్రాంతి పండుగ సందర్భంగా కార్మికులకు నూతన వస్త్రాలు, స్వీట్లు, మహిళలకు బహుమతులు అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాకొళపు వెంకట నరసింహమూర్తి, నూలి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంతీదేవి ఉత్సవాలు

దేవరపల్లి: కుంతీదేవి ఉత్సవాలు శనివారం మండలంలోని పల్లంట్ల గ్రామంలో వైభవంగా జరిగాయి. ఉదయం కుంతీదేవి, నందీశ్వరునికి పూజలు నిర్వహించి అనంతరం గ్రామంలో కోలాహలంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అక్కాబత్తుల వెంకటరమణ, నూతలపాటి రమేష్, చింతల హరి, మందపాటి దశరధుడు, మెప్పెల్లి వెంకటేష్, చింతల దాస్, తదితరులు పాల్గొన్నారు.

'ఆమె ఆరోపణల్లో నిజం లేదు'

తాళ్లపూడి: రాజకీయ దురుద్దేశంతోనే తాడిపూడిలోని, ఇతర గ్రామాల్లోని కొందరు నాయకుల ప్రోద్బలంతో తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గంటా కృష్ణ పేర్కొన్నారు. తనపై పత్రికల్లో వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. గంజాయి కేసులో తన భర్తను అన్యాయంగా ఇరికించారని తాడిపూడికి చెందిన మహిళ అక్కాబత్తుల సంధ్య తనపై చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఈ విషయంలో తనకెలాంటి సంబంధం లేదని గంటా కృష్ణ శనివారం విలేకుల సమావేశంలో వివరణ ఇచ్చారు. సంధ్య భర్త అయిన లక్ష్మణ్ జనసేన పార్టీలోనే ఉన్నందున తనతో కలిసేవాడని, ఆయన తన వద్ద డ్రైవర్‌గా ఎప్పుడూ పనిచేయలేదన్నారు. డ్రైవింగ్ పని ఉంటే చెప్పమని లక్ష్మణ్ తనను కోరాడని కృష్ణ తెలిపారు. దాంతో తన సూచన మేరకు జనసేన నియోజకవర్గ నాయకుడు టీవీ రామారావు కారుపై ఒక్క రోజు మాత్రమే లక్ష్మణ్ పనిచేశాడని తెలిపారు. ఆయన గంజాయి కేసుతో పట్టుబడితే తనకేమి సంబంధమని ప్రశ్నించారు. గ్రామస్తుడిగా అతని భార్య సాయం కోరితే చేస్తానే తప్ప ఈ కేసుతో తనకు సంబంధం లేదన్నారు.

పందేలేస్తాం.. అడ్డుకుంటాం

- ఇటు అధికారుల.. అటు కోడి పందేల నిర్వాహకులు
- గ్రామాల్లో సిద్ధం చేస్తున్న బరులు
- ధ్వంసం చేస్తున్న అధికారులు
- ఇప్పటికే వందలాది మంది బైండోవర్



నిడదవోలు మండలంలోని ఓ గ్రామంలో హెచ్చరిక బోర్డును ప్రదర్శిస్తున్న పోలీసులు

నిడదవోలు రూరల్: సంప్రదాయం ముసుగులో కోడి పందేలు నిర్వహించొద్దు.. సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోండి.. జూదాల జోలికి వెళ్లకండి.. అంటూ పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూదాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమంటూ హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ నిర్వాహకులకు ఇవేమీ పట్టడం లేదు. కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిడదవోలు మండలంలో వారం రోజులుగా పందెం కోడిపుంజుల విక్రయాలు జోరందుకున్నాయి. ఒక్కో కోడిపుంజు ధర రూ.2 వేల నుంచి రూ.10 వేల పైనే పలుకుతోంది. గ్రామాలకు దూరంగా ముందుగానే ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో ఇప్పటికే పందేల బరులను సిద్ధం చేశారు. మరోపక్క గతేడాది పందేలు నిర్వహించిన ప్రాంతాలను గుర్తించిన పోలీసులు సంబంధిత యాజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పల్లెల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నిడదవోలు పరిధిలో ఏటా కోడిపందేల నిర్వహణతో రూ.కొన్ని కోట్లు చేతులు మారుతున్నాయి. మండలంలోని సింగవరంలో జరిగే పోటీలకైతే రాజకీయ, సినీనటులు, వ్యాపారవేత్తలు వచ్చి భారీస్థాయిలో పందేలు కాస్తుంటారు. నిడదవోలుతో పాటు విజ్జేశ్వరం, డి.ముప్పవరం, కాటకోటేశ్వరం, తాడిమళ్ల, కోరుమామిడి తదితర గ్రామాల్లో కోడిపందేల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పందేలు ఎక్కడ నిర్వహిస్తున్నారో గుర్తించి సంబంధిత యాజమానికి హెచ్చరికలు జారీ చేశామని ఎస్సై షేక్ సుభానీ తెలిపారు. ఎవరైనా పందేలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, పోలీసు సిబ్బందితో నిఘా ఉంచామని ఎస్సై పేర్కొన్నారు.

పెరవలి మండలంలో..

పెరవలి: కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఒక పక్క పోలీసు శాఖ గ్రామగ్రామానా జోరుగా ప్రచారాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. మరోపక్క అదే స్థాయిలో కోడిపందేలు నిర్వహణకు మారుమూల ప్రాంతాల్లో బరులను సిద్ధం చేశారు. మండలంలోని ఖండవల్లి, ముక్కామల, పెరవలి, అజ్జరం, వెంకట్రాయపురం, మల్లేశ్వరం, పిట్టల వేమవరం గ్రామాల్లో నిర్వాహకులు బరులను సిద్ధం చేశారు. కోడి పందేలను హైకోర్టు నిషేధించడమే గాకుండా, ఈ విషయంలో జిల్లా ఎస్పీ జగదీష్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పందేలు జరుగుతాయా? లేదా? అనే మీమాంసలో పందేల నిర్వాహకులు ఉన్నారు. ఇప్పటికే పోలీసులు మండలంలో 110 కోడి కత్తులను స్వాధీనం చేసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేశారు. అదీగాక గతంలో గతంలో కోడి పందేలు నిర్వహించిన 160 మందిపై బైండవర్ కేసులు పెట్టారు. మరోవైపు రెన్యూ శాఖ కోడి పందేలు జరిగే స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసింది. పందేల బరుల వద్ద పోలీసు శాఖ బ్యానర్లు ఏర్పాటు చేసినప్పటికీ, పందేల నిర్వాహకులు వాటిని పట్టించుకోకుండా తమ పనులు చేసుకుపోతున్నారు. బరుల వద్ద భారీఎత్తున జూదాలు కూడా అవకాశం ఉంది.

దేవరపల్లి: మండలంలోని వివిధ గ్రామాల శివార్లలోని ఆయిల్‌పామ్, కొబ్బరి తోటలు, మైదాన ప్రాంతాల్లో కోడి పందేల నిర్వహణకు శనివారం సాయంత్రం నుంచి బరులను సిద్ధం చేస్తున్నారు. ఒక పక్క పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు కోడి పందేలు, జూదాలపై నిషేధం విధించినప్పటికీ నిర్వాహకులు మాత్రం తమ పని తాము చేసుకునిపోతున్నారు. బరులు ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు వాటిని ధ్వంసం చేసి నిషేధ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. యర్నగూడెం, దేవరపల్లి, బందపురం, యాదవోలు, కృష్ణంపాలెం, త్యాజంపూడి గ్రామాల్లో బరులు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఆయా గ్రామాల్లో ట్రైనీ డీఎస్పీ భానోదయ, ఎస్సై కె.శ్రీహరిరావు దాడులు నిర్వహించి బరులను ధ్వంసం చేశారు.

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం, పెద్దేవం, తాళ్లపూడి, రావూరుపాడు తదితర గ్రామాల్లో బరులు సిద్ధం చేసే పనిలో నిర్వాహకులు నిమగ్నం అయ్యారు. మొత్తం మండలంలోని ఏడు చోట్ల పందేలు జరిగే అవకాశం ఉంది. అయితే పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయకుండానే పోలీసులు అడ్డుకుంటున్నారు. కోడి పందేలకు అనుమతులు లేవని తాళ్లపూడి ఎస్సై కె. వెంకటరమణ స్పష్టం చేశారు.ఇప్పటికే 70 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.



కోడి పందేలు నిర్వహించవద్దంటూ పెరవలిలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రచారం



యర్నగూడెంలో బరిని ధ్వంసం చేయిస్తున్న ట్రైనీ డీఎస్పీ భానోదయ, ఎస్సై శ్రీహరిరావు



తాళ్లపూడి మండలం పెద్దేవంలో కోడి పందేల బరి వద్ద ఎస్సై వెంకటరమణ

పందేల బరుల ధ్వంసం



అనంతపల్లిలో కోడిపందేల బరిని ధ్వంసం చేస్తున్న రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు

నల్లజర్ల: సంప్రదాయం పేరుతో సంక్రాంతి రోజుల్లో కోడి పందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లవద్దని నల్లజర్ల తహసీల్దార్ వి.కిశోర్‌కుమార్ సూచించారు. కోడిపందేలు నిర్వహించవద్దంటూ శనివారం ఆయన అనంతపల్లి, దూబచర్ల, ఘంటావారిగూడెం తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోడిపందేల బరులను ధ్వంసం చేశారు. తమ పరిధిలో ఎక్కడైనా కోడిపందేల బరులు ఏర్పాటు చేసినా, పందేలు నిర్వహించినా వెంటనే సమాచారం అందించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను తహసీల్దార్ ఆదేశించారు. అలాంటి ప్రాంతాల్లో ఇప్పటికే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పందెం పుంజుల కాళ్లకు కత్తులు కట్టేవారిని, గతంలో కోడి పందేల్లో పాల్గొన్న వారిని గుర్తించామని చెప్పారు. పందేల నిర్వహణకు స్థలాలను లీజుకు ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై వెంకట సురేష్, పశుసంవర్ధక శాఖ ఏడీ జాన్ వెస్లీ ,వీఆర్వో శ్రీనివాస్, సచివాలయ డీఏ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

సుందర నిడదవోలు సాధన లక్ష్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- గణపతి జంక్షన్ అభివృద్ధి పనుల పరిశీలన



గణపతి సెంటర్ జంక్షన్ సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణాభివృద్ధిలో భాగంగా అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలతో పాటు ప్రధాన సెంటర్లలో సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. స్థానిక గణేష్ చౌక్ సెంటర్ నుంచి గణపతి జంక్షన్ వరకూ నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులను రూ.5.25 కోట్ల వ్యయంతో చేపట్టిన విషయం విదితమే. గణపతి సెంటర్ జంక్షన్ అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పరిశీలించారు. సంక్రాంతి సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చే ప్రజలకు, వారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్‌ను వదలాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అన్నివిధాలా నిడదవోలు పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని గతంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నామన్నారు. అందులో భాగంగా యుద్ధప్రాతిపదికన గణపతి జంక్షన్ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇక్కడ వాటర్‌ఫాల్, పార్కు, బస్ షెల్టర్, మంచినీటి పైపులైన్, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ ముందు భాగంలో పాదచారులు, పార్కింగ్‌కు వీలుగా అధునాతన లాకింగ్ టైల్స్ పనులు వేగంగా సాగుతున్నామన్నారు. డివైడర్ల మధ్యలో పూల మొక్కలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్లు ఎస్‌కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, దిరిసిన రామచంద్రరావు, ఎండీ ఫయాజ్, ఆలమూరు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు



త్యాజంపూడిలో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న కుసులూరి వెంకటసతీష్

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని త్యాజంపూడిలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ గ్రామ సచివాలయాల మండల కన్వీనర్, ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్ ప్రారంభించారు. డీవైఎఫ్ఐ నాయకులు గారపాటి ప్రసన్న కృష్ణ మాట్లాడుతూ మద్యం, మాదక ద్రవ్యాల వల్ల యువత పాడైపోతుందన్నారు. ఏటా సంక్రాంతి సందర్భంగా గ్రామంలో ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ బుజ్జిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు గట్టం నాని, కార్యదర్శి కొత్తపల్లి తాతారావు, పరపతి సోమశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్. భగత్, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఊనగట్ల జెడ్పీ హైస్కూల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

చాగల్లు: మండలంలోని ఊనగట్ల హైస్కూల్లో 1987-92 సంవత్సరాల మధ్య ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుకున్న విద్యార్థుల ఆత్మయ సమ్మేళనం శనివారం ఆ హైస్కూల్లో జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన పూర్వపు ఉపాధ్యాయులు జి.అప్పారావు, ఎ.సూర్యనారాయణ, జి.నాగమణి తదితరులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ రమణ మాట్లాడుతూ అన్ని వసతులూ ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సంఖ్య క్రమంగా తగ్గిపోవడం ఆందోళనకరం అన్నారు. ఈ వేడుకకు పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరై ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పాత స్మృతులను స్మరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు (దత్తుడు), పూర్వ విద్యార్థులు నల్లూరి సూరిబాబు, రత్నంరాజు, కె.గోవింద్, కె.సురేంద్ర, ఎ.శివ, రామకృష్ణ, కె.నాగేశ్వరరావు, జి.విజయలక్ష్మి, అన్నపూర్ణ, ముప్పరాజు, వెంకట రమేష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



తిమ్మరాజుపాలెంలో నాయుడు అప్పారావు చిత్ర పటానికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి నివాళి

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నాయుడు అప్పారావు, సూరాపురానికి చెందిన కోలా సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారిద్దరి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శనివారం పరామర్శించారు. అప్పారావు, సుబ్బారావు చిత్ర పటాలకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, నాయకులు అయినీడి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: యర్నగూడెం గండి చెరువు వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బోడపాటి రాంబాబు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు నడుపుతున్న మోటార్ సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న రాళ్లగుట్టను ఢీ కొట్టింది. గాయపడిన రాంబాబును చికిత్స కోసం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దేవరపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



కొవ్వూరులో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న చైర్‌పర్సన్ బావన రత్నకుమారి



అన్నదేవరపేటలో ముగ్గులకు మార్కులు వేస్తున్న జెడ్పీ వైస్ చైర్ పర్సన్ శ్రీలేఖ

కొవ్వూరు: స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు, సంస్కృతి సంప్రదా యాలను,ఆచారాలను ప్రతిబించేలా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం హర్షణీయం అన్నారు. విజేతలైన మహిళలకు చైర్‌పర్సన్ బహుమతులు ప్రదానం చేశారు. ముగ్గుల పోటీలకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, ఏడో వార్డు కౌన్సిలర్ పాలూరి నీలిమ, తాడిమళ్ల విజయవాణి, మట్టే సుభాషిణి, మట్టే చైతన్య, ఏచూరి విజయ స్పందన న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కక్కిరాల సూరిబాబు, పలుకూరి రామారావు, వలివేటి ప్రసాద్, సత్యవరపు భరత్,మద్దుల సత్యనారాయణ, గోవర్ధనం శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం అన్నదేవరపేట గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ గ్రామంలోని బంగారు పాపమ్మ ఆలయ ప్రాంగణంలో ఈ పోటీలు జరిగాయి. ఆ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ పప్పొప్పుల నాని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆ పార్టీ నాయకులు నాని, జి.ఈశ్వరరావు , నూతంగి సురేష్‌ల సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణ దేవరాయలు, పంచాయతీ సర్పంచ్ ఎలిపే సుధారాణి, నూతంగి సురేష్ పాల్గొన్నారు.



వేగేశ్వరపురం పంచాయతీ వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

వేగేశ్వరపురంలో సంక్రాంతి సంబరాలు

వేగేశ్వరపురం పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, కార్యదర్శి డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద ఘనంగా ఈ వేడుకలు జరిగాయి. భోగి మంట వేశారు. మహిళలు రంగవల్లులను తీర్చిదిద్దారు. ఇంకా హరిదాసు కీర్తనలు, మహిళా ఉద్యోగుల ఆటపాటలతో సచివాలయ ప్రాంగణం అంతా సందడిగా మారింది. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శి నాగాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు రావిపాటి లక్ష్మణరావు, నాయకులు శీర్ల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోనే ఆత్మ సంతృప్తి



కుష్టు రోగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై నాగరాజు, రంగా వెంకటేశ్వరరావు

నిడదవోలు: సామాజిక సేవలోనే నిజమైన ఆత్మ సంతృప్తి లభిస్తుందని పట్టణ ఎస్సై పి.నాగరాజు అన్నారు. స్థానిక లెప్రసీ కాలనీలోని కుష్టు రోగులకు శనివారం ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా నిడదవోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రంగా సుబ్బారావు, సత్యవతి జ్ఞాపకార్థం వారి కుమారుడు లయన్ రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పెరవలి మండలానికి బదిలీపై వెళుతున్న పట్టణ ఎస్సై పి.నాగరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ, గారపాటి శివరామకృష్ణ, గారపాటి ప్రసాద్, అల్లూరి రామకృష్ణ, నీలం రామారావు, కె. అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సర్పంచ్ వీరకుమారి

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా దేవరపల్లికు చెందిన టి ముకుంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక దళితవాడలోని బాబూ జగ్జీవన్‌రామ్ సెంటర్లో 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ కడిమి వీరకుమారి చేతుల మీదుగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, పంచాయతీ సభ్యుడు తంగెళ్ల సుబ్రహ్మణ్యం వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంస్థ ద్వారా దేవరపల్లి, గోపాలపురం, కొవ్వూరు మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కడిమి రాజు, జగ్జీవన్‌రామ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కోలాహలంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

నల్లజర్ల: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో కోలాహలంగా జరుగుతున్నాయి. ఇందు కోసం నాలుగు మైదానాలు రూపొందించారు. షెడ్యూల్ ప్రకారం క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతున్నట్టు ఎంపీడీఓ రాజశేఖర్ తెలిపారు. ఇప్పటికే 90కి పైగా మ్యాచ్‌లు నిర్వహించామన్నారు. విజేత జట్లకు తదుపరి మ్యాచ్‌లకు ఈనెల 18 నుంచి నిర్వహిస్తామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి వచ్చే జట్లతో సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు దగ్గర ఉండి తీసుకు వస్తున్నారన్నారు. పోటీలన్నీ సక్రమరీతిలో జరుగుతున్నాయని తెలిపారు.

వేగిరాజు కుటుంబీకుల ఆత్మీయ కలయిక



పెండ్యాల గ్రామంలో వేగిరాజు వంశవృక్షం

నిడదవోలు రూరల్: మండలంలోని పెండ్యాల గ్రామంలో వేగిరాజు వంశవృక్షం ఆత్మీయ సమావేశాన్ని ఆనందోత్సాహాల మధ్య శనివారం నిర్వహించారు. వేగిరాజు రామరాజు, వెంకాయమ్మ కుమారులైన నారాయణరాజు, వెంకట్రాజు కుటుంబ సభ్యులు మొత్తం 130 మంది కలిసి ఈ ఆత్మీయ వేడుకలో పాల్గొన్నారు. దేశ, విదేశాల్లో వివిధ వ్యాపారాల్లో, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా ఒకేసారి కలిసి సంక్రాంతి పండగను పెండ్యాలలో జరుపుకోవడం సంతోషంగా ఉందని వేగిరాజు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

నిడదవోలు రూరల్: గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శనివారం తెలిపారు. విజ్జేశ్వరం నుంచి ఇసుక తరలిస్తున్న బొబ్బర్లంకకు చెందిన మత్తిరెడ్డి చిన్ని, పెండ్యాల గ్రామానికి చెందిన గొర్రె సురేష్‌లను అరెస్ట్ చేసి క్వారీ లారీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే పందలపర్రు ర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్న కోరుపల్లికి చెందిన పి.రామాంజనేయులును అరెస్ట్ చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)

90100 51493 (నిడదవోలు)

90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com